## పరకాలలో 'చల్లా'దే గెలుపు

### వైస్ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి

ఆత్మకూరు, డిసెంబర్ 1 : సర్వేలు ఎన్ని చేసినా మూడో సారి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలుస్తున్నారని వైస్ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలిచిన తరువాతనే అభివృద్ధి అంటే ఏంటో రుచి చూపించారన్నారు. పరకాల రూపు రేఖలను మార్చిన ఘనతా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చింది ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డే అని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న ఎమ్మెల్యేను ఈ ఎన్నికల్లో ఆదరించారన్నారు. ఈ ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు జిన్నా రామకృష్ణారెడ్డి, పూజరి రాముపటేల్, వంగాల భగవాన్‌రెడ్డి, రేవూరి సంపత్‌రెడ్డి, భాషబోయిన పైడి, పొగాకుల సంతోష్, వీర్ల వెంకటరమణ, పసునూటి దేవేందర్, మండల కోఆప్షన్‌మెంబర్ ఎండీ అంకూస్ పాల్గొన్నారు.

## 'చల్లా గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'

నడికూడ, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం గత కొంతకాలంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దురిశెట్టి చంద్రమౌళి, నందికొండ గణపతిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, ఈ నెల 3వ తేదీన బీఆర్ఎస్ విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల అభివృద్ధికి విశేష కృషి చేశారని, హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చల్లా గెలుపులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు.

## ఓట్ల లెక్కల్లో నాయకులు బీజీ

### మనమే గెలుస్తామంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

సంగెం, డిసెంబర్ 1 : శాసనసభకు గురువారం జరిగిన ఎన్నికల్లో సంగెం మండలంలోని ఆయా గ్రామాల్లో తమ తమ పార్టీలకు ఎన్ని ఓట్లు పడ్డాయనే లెక్కల్లో రాజకీయ పార్టీల నాయకులు తలమునకలయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి మండలంలోని 33గ్రామపంచాయతీల్లో ఏ ఊర్లో మన పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి, ఎన్ని మిస్ అయ్యాయి, ఏయే బూత్‌లలో ఓట్లు వేయని వారెవరు..? అనే కోణంలో రాజకీయ పార్టీలకు చెందిన మండల నాయకులు ఆయా గ్రామాల్లోకి వెళ్లి తమ పార్టీ నాయకులతో చర్చించారు. పరకాల నియోజకవర్గంలో సంగెం మండలం బీఆర్ఎస్ పార్టీకి లీడ్ ఇస్తుందని, పరకాల ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డి గెలుస్తున్నారని ఆ పార్టీ శ్రేణులు సంబురపడుతున్నారు.

# ఎయిడ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరిదీ కీలకపాత్ర

- డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు
- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు

వరంగల్, డిసెంబర్ 1 : ఎయిడ్స్‌వ్యాధి నియంత్రణలో ప్రభుత్వమే కాకుండా అన్ని స్వచ్ఛంద సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశిరావు తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాధిగ్రస్తులకు కావాల్సిన వైద్యపరమైన సదుపాయాలు అందిస్తున్నామని అన్నారు. ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకపోతున్నామని తెలిపారు. హెచ్ఐవీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, సిరంజీలు, కలుషితమైన రక్తం ఎక్కించడం, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి పుట్టబోయే పిల్లలకు వ్యాపిస్తుందన్నారు. గర్భిణులకకు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించాలని అన్నారు. లైంగిక వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రతి గురువారం అడల్ట్ ఫ్రెండ్లీ క్లినిక్‌లు, మొబైల్ హెల్త్ క్లినిక్‌లను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యా కూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ హిమబిందు, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, పరిపాలన అధికారి చంద్రకళ, స్టాటస్టికల్ అధికారి ప్రసన్నకుమార్, స్వచ్ఛంద సంస్థలప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

### ముల్కనూరులో అవగాహన ర్యాలీ..

భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూరు ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వీధుల్లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, అధ్యాపకులు శ్రీనివాస్, సుప్రియ, శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, ఉదయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం..

న్యూశాయంపేట : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కృషి చేయాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల రమ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాధిక, అధ్యాపకులు గీత, శైలజ, దీప్తి పాల్గొన్నారు.

### 'చైతన్య'లో అవగాహన ర్యాలీ

హనుమకొండ చౌరస్తా : కిషన్‌పురలోని చైతన్య విశ్వవిద్యాలయంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ జీ దామోదర్ మాట్లాడుతూ యువతకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం రవీందర్, అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ ఎస్ కవిత, అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్ సుమ, ఫార్మసీ డీన్ వీ మల్లికార్జున్, ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ జీ శంకర్‌లింగం, అగ్రికల్చర్ డీన్ ప్రొఫెసర్ సీ చేరాలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, వివిధ విభాగాలకు చెందిన శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఎల్బీ కాలేజీలో..

లాల్‌బహదూర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ర్యాలీ కేఎంసీ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ రఘువేందర్‌రెడ్డి, హింగె రాజేశ్వర్‌రావు, ఉమ్మగోని శ్రీనివాస్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




భీమదేవరపల్లి : ముల్కనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు





న్యూశాయంపేట : ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



హనుమకొండ చౌరస్తా : ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

శాయంపేట, డిసెంబర్ 1 : పత్తిపాక గ్రామంలోని రవీంద్ర భారతి పాఠశాలలో చదువుకున్న 2009-10టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ నకిరబోయిన కుమారస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అంతా ఒక్కచోట చేరి చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు శేషాద్రి మల్లయ్య, వీరగాని సత్యం, పసునుటి రమణయ్య, ఐరబోయిన భిక్షపతి, బండ నిరంజన్‌రెడ్డి, వైద్యుల తిరుపతిరెడ్డి, కందకట్ల హరికృష్ణ, ప్రకాశ్, ఎర్ర రాకేశ్‌రెడ్డి, విద్యార్థులు శ్రీకాంత్, ప్రశాంత్, రమేశ్, శృతి, దివ్య, గీత, మహేశ్, సింధుజ, రజిత, రాజు, కిరణ్, శ్వేత, వెంకటేశ్, రజినీకర్, సరిత, సాయిరాం, చిరంజీవి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, టీచర్లు

## చికిత్స పొందుతూ ఆపరేటర్ మృతి

గీసుగొండ, డిసెంబర్ 1 : చికిత్స పొందుతూ ఆపరేటర్ మృతి చెందిన ఘటన మండలంలోని శాయంపేట టెక్స్‌టైల్ పార్కులో జరిగినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సింగరావ్ జిల్లా వడిగడి తాలుక గిదేర్ గ్రామానికి చెందిన రామయన్ ప్రసాద్‌యాదవ్ (23) 9నెలలుగా టెక్స్‌టైల్ పార్కులోని గణేశా కంపనీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 23న కంపనీలో పనిచేస్తుండగా దారం బెల్ నడుముపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో తోటి కార్మికులు కంపెనీ అంబులెన్స్‌లో వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి తండ్రి సిపాయ్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## వైభవంగా కార్తీక మాస పూజలు

పరకాల, డిసెంబర్ 1: పట్టణంలోని శ్రీ భవానీ కుంకుమేశ్వర ఆలయంలో కార్తీక మాస పూజలు వైభవంగా జరిగాయి. శుక్రవారం శైవాగమ పండితుడు కోమాళ్లపల్లి సంతప్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహారుద్రయాగ సహిత ఆకాశ దీపోత్సవ మహాఅన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణశర్మ, ఈవో వెంకటయ్య పాల్గొన్నారు.



ఆలయంలో మహాఅన్నదానం చేస్తున్న నిర్వాహకులు

# జిల్లాలో తగ్గిన ఓటింగ్

- వరంగల్ పశ్చిమలో 56.59 శాతం
- పరకాలలో 84.61 శాతం నమోదు

హనుమకొండ, డిసెంబర్ 1 : హనుమకొండ జిల్లాలో ఓటింగ్ శాతం తగ్గింది. జిల్లా అధికార యంత్రాంగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని పరకాల నియోజకవర్గంలో 84.61శాతం, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 56.59శాతం ఓట్లు నమోదయ్యాయి. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి 5గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహించినప్పటికీ కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు కొనసాగింది. అయితే ఈ సారి గతంలో జరిగిన ఎన్నికలలో కంటే ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికీ డిలీషన్ల సంఖ్య తగ్గడంతో ఓటింగ్ శాతం తగ్గిందని అధికారులు అంటున్నారు. ఇందులో ఎక్కువ శాతం మహిళలు, యువత పెద్ద ఎత్తున ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

### వరంగల్ పశ్చిమలో..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,86,688మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,41,736 మంది పురుషులు, 1,44,939 మంది మహిళలు, ఇతరులు 15మంది ఉన్నారు. వీరిలో 1,62,236 మంది ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. వారిలో 79,840 మంది పురుషులు, 82,396 మంది మహిళలు ఓటు హక్కు వినయోగించుకున్నారు. నియోజకవర్గం పరిధిలో 56.59శాతం ఓటింగ్ నమోదైంది 2018సంత్సరంలో జరిగిన ఎన్నికల్లో 59.71 శాతం ఓటింగ్ జరిగింది. దీంతో పోల్చుకొంటే ఓటర్లు పెరిగినప్పటికీ సుమారు రెండు శాతం ఓటింగ్ తగ్గింది.

### పరకాలలో 84.61శాతం..

పరకాల, డిసెంబర్ 1 : పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా 84.61శాతం పోలింగ్ నమోదైంది నిమయోజకవర్గ వ్యాప్తంగా 2,21,436మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,08,280 మంది, మహిళలు 1,13,154మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 91,917మంది పురుషులు, 95,445మంది మహిళలు మొత్తంగా 1,87,362మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాపంగా 89.51శాతం పోలింగ్ నమోదు కాగా గురువారం జరిగిన ఎన్నికల్లో 4.9శాతం తగ్గి 84.61గా నమోదైంది. కాగా సంగెం మండలం చంద్రయ్యపల్లి గ్రామంలోని 150వ బూత్‌లో అత్యధికంగా 95.6శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ బూత్‌లో 500 మంది ఓటర్లకుగాను 478మంది ఓటర్లు ఓటు వేశారు. పరకాల పట్టణంలోని 44వ బూత్‌లో అత్యల్పంగా 63.23శాతం నమోదైంది. ఇందులో 1,107మంది ఓటర్లకుగాను 700ల ఓటర్లు మాత్రమే ఓటు వేశారు.



శాయంపేట : ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

### శాయంపేటలో 86శాతం పోలింగ్

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికలకు జరిగిన పోలింగ్‌లో శాయంపేట మండలంలో భారీగా ఓటింగ్ జరిగింది. మండల వ్యాప్తంగా 86శాతం పోలింగ్ నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. 2018 ఎన్నికల్లో 77.82 శాతం పోలింగ్ జరిగింది. దీనిని మించి ఈసారి పది శాతం మేరకు పోలింగ్ పెరగడంతో నేతలు లెక్కల్లో మునిగారు.

### ఎల్కతుర్తిలో 86.76శాతం పోలింగ్

ఎల్కతుర్తి : అసెంబ్లీ ఎన్నికలకు గురువారం జరిగిన ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 86.76శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో మొత్తంగా 37,726మంది ఓటర్లు ఉండగా, 27,525మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దామెరలో 3902, ఎల్కతుర్తిలో 2838, కేశవాపూర్‌లో 2472, చింతలపల్లిలో 1244, కోతులనడుమలో 1148, వల్బాపూర్‌లో 1241, వీరనారాయణపూర్‌లో 861, జగన్నాథపూర్‌లో 964, సూరారంలో 2285, గోపాల్‌పూర్‌లో 2171, బావుపేటలో 1877, జీల్గులలో 1436, పెంచికల్‌పేటలో 1570, దండేపల్లిలో 2172, తిమ్మాపూర్‌లో 1349మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇందులో 15,610 మంది పురుషులు ఉండగా, 13,631 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. మహిళలు 16,116, పురుషులు 19,894మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఫలితాల కోసం ఆయా పార్టీల నాయకులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.